01ATP08_01ATP08.qxd 08-05-2026 PM 10:44 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 09 మే 2026 పేజీలు : 04

ఇంటి స్థలాల కోసం అనువైన భూములను ఎంపిక చేయండి

భూమి వివరాలు తెలిపే మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మే 8 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని అర్హులైన పేదలకు ఇంటిస్థలాలను పంపిణీ చేయడం కోసం అనువైన భూములను ఎంపిక చేయాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని వెలిగొండ, చాబాల, ఇంద్రావతి రోడ్లలోని రెవెన్యూ అధికారులు ఇంటి పట్టాల కోసం గుర్తించిన భూములతోపాటు కోనాపురం క్రాస్‌లో ఇండస్ట్రీల ఏర్పాటుకై ప్రతిపాదించిన భూమిని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల భూముల వివరాలు తెలిపే మ్యాప్‌లను పరిశీలించిన మంత్రి ఇంటిస్థలాల కోసం ఎక్కువ భాగం చదునుగా ఉన్న ప్రభుత్వ భూములు, ధర తక్కువగా ఉన్న ప్రైవేటు భూములను గుర్తించి ప్రతిపాదించాలన్నారు. ఉరవకొండ పట్టణంలోని పేదలకు ఇంటిపట్టాలతోపాటు గార్మెంట్స్ పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న క్రమంలో భూముల

- క్షేత్ర పరిశీలనలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

పరిశీలించి గార్మెంట్స్ పరిశ్రమల కోసం 500 ఎకరాల వరకు భూమి అవసరమవుతుందని సూచించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పాటిల్ భోగనగౌడ్, మండల సర్వేయర్ ఆర్.డి.రత్నాకం బాబు, మాజీ సర్పంచ్ యర్రగుంట్ల వెంకటేష్, టీడీపీ నాయకులు సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు..

కళ్యాణదుర్గం, మే 8, ప్రభాతవార్త:

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. సతీమణి రమాదేవి, కుటుంబ సభ్యులు, ఆత్మీయ మిత్రులతో కలిసి ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ వేదపండితులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనాలు అందించి, అమ్మవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఆలయ ఆధ్యాత్మిక వాతావరణంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు భక్తి పరవశంతో అమ్మవారి కటాక్షం పొందారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్సీ చైర్మన్ ముత్తినేని రాజగోపాల్, సతీమణి ముత్తినేని రాధామాధవి, ముత్తినేని రాహుల్ ఆదిత్య, దేవినేని వెంకటేష్, మహీధర్ పాల్గొన్నారు.

◄శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

నేను సత్యసాయి బాబాకు మాటిచ్చాను

- మీరు సత్య సాయి స్కీముల మెయింటెన్స్ కు నిధులు ఇవ్వాల్సిందే
- సీనియర్ ఐపిఎస్ అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు
- జిల్లా కలెక్టర్ ఆనంద్ లేవనెత్తిన సమస్యపై స్పందించిన చంద్రబాబు

అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశం లో అనంతపురం కలెక్టర్ ఆనంద్ లేవనెత్తిన సమస్య పై సీఎం చంద్రబాబు స్పందిస్తున్న దృశ్యం

అనంతపురం, మే 8, (ప్రభాతవార్త బ్యూరో)

శ్రీ సత్య సాయి మంచినీటి పథకాల నిర్వహణ బాధ్యత ప్రభుత్వానిదే. నేను అప్పట్లో సీఎంగా ఉన్నప్పుడు పుట్టపర్తి సత్యసాయిబాబా కు మాటిచ్చాను. సత్యసాయి స్కీముల నిర్వహణకు ఏదో స్కీం కింద నిధులు ఇవ్వాల్సిందే అంటూ సీనియర్ ఐఏఎస్ అధికారులను శుక్రవారం అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేయడం విశేషం. ఆసక్తికరంగా సాగిన అధికారుల చర్చలో సీఎం చంద్రబాబు స్పందన అభినందనీయం. వివరాల్లోకి వెళ్తే.. కలెక్టర్ల సమావేశంలో అనంతపురం తాగునీటి సమస్యలపై అనంతపురం కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ "సార్, అనంతపురంలో తాగునీటి సమస్యల గురించి. మనకు అక్కడ సత్యసాయి వాటర్ సప్లై బోర్డు , రూరల్ వాటర్ సప్లై కి సంబంధించిన చాలా స్కీమ్స్ ఉన్నాయి . వాటికి సంబంధించిన పేమెంట్స్ అన్నీ కూడా రూరల్ లోకల్ బాడీస్ లేదా అర్బన్ లోకల్ బాడీస్ ద్వారా జరగాలి. కానీ వారి దగ్గర నుండి పేమెంట్స్ క్రమం తప్పకుండా రావడం లేదు. దీనివల్ల మేము ప్రాపర్ మంచినీటి పథకాల నిర్వహణ పనులు చేపట్టలేకపోతున్నాం. ఈ వేసవి కాలంలో ఇది ఇబ్బందిగా మారుతోంది. పంచాయతీ రాజ్ , మున్సిపల్ శాఖ విభాగాలకు తగిన ఆదేశాలు ఇస్తే, ఒక సెంట్రలైజ్డ్ లెవెల్ లో ఆ నిధులను ఆర్.డబ్ల్యూ.ఎస్ కి కేటాయిస్తే బాగుంటుంది." అని విజ్ఞప్తి చేశారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ సీనియర్ ఐఏఎస్ అధికారులు శశి భూషణ్ ను చూస్తూ "దీనిపై మీరు వర్క్ చేయండి. మీరు ఈ స్కీమ్‌ను టేకాఫ్ చేయండి. సెంట్రలైజ్డ్ గా ఉండాలి, జిల్లా పరిషత్ జోక్యం లేకుండా ఒక అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వాళ్లకు నీళ్లు అందేలా చూడాలి." అని ఆదేశించారు. ఆ సమయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య అధికారి శశిభూషణ్ స్పందిస్తూ "తప్పకుండా సార్, అనంతపురం కలెక్టర్ కోరిన విధంగా తగిన పరిష్కారం చూపిస్తాం. ప్రస్తుతం మా పని తీరుకు ఇది కొంచెం భిన్నంగా ఉన్నప్పటికీ ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీ కూడా దీనికి అంగీకరించారు. ఒక మంచి పరిష్కారం కనుగొంటాం." అని సమాధానం ఇచ్చారు. దీనిపై సీఎం చంద్రబాబు మళ్లీ జోక్యం చేసుకుంటూ "చూడండి, నాకు ఇవేమీ తెలియవు. పుట్టపర్తి సత్యసాయి బాబా ప్రత్యేక చొరవతో శ్రీ సత్య సాయి మంచినీటి ప్రాజెక్ట్ ప్రారంభించే ముందు నన్ను పిలిచి ఒకటే రిక్వెస్ట్ చేశారు. ఖనేను ఎంతో కష్టపడి ఈ ప్రాజెక్ట్ కట్టాను, దీని మెయింటెనెన్స్ బాధ్యత మీరే తీసుకోవాలిఖి అని అడిగారు. అప్పుడు నేను సత్య సాయి బాబాకు మాట ఇచ్చాను, మీరు ప్రాజెక్ట్ కడితే నీళ్లు ఇచ్చే బాధ్యత, మెయింటెనెన్స్ బాధ్యత నేను తీసుకుంటానని చెప్పాను. అది నా కమిట్‌మెంట్. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో నాలుగు చోట్ల ఇటువంటి ప్రాజెక్టులు కట్టారు ఇక్కడ, మహబూబ్ నగర్, మెదక్ , తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సత్య సాయి మంచినీటి పథకాలను అమలు చేశారు. గత ప్రభుత్వంలో దీన్ని సరిగ్గా మెయింటైన్ చేయకుండా అంతా గందరగోళం చేశారు. ఇకపై అలా జరగకూడదు. పాత సిస్టమ్‌నే మళ్ళీ పునరుద్ధరించండి. అవసరమైన నిధులు విడుదల చేయండి అంటూ సీఎం చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సమావేశంలో రాష్ట్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆనంద్ చొరవతో సమస్యలను దృష్టికి తీసుకెళ్లడం సీఎం స్పందించడం విశేషంగా చెప్పొచ్చు..

ప్రజా సమస్యలపై స్పందన వేగంగా ఉండాలి

- 15 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు, కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల ఇన్సూరెన్స్ అందజేసిన ఎమ్మెల్యే సునీత

సిఎంఆర్ఎఫ్ చెక్కులను అంజదేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, మే 8 ప్రభాతవార్త బ్యూరో

ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో అధికారుల స్పందన వేగంగా ఉండాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. పలు సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజలను పదేపదే తిప్పించుకోవద్దని ఆమె అన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై ఎమ్మెల్యే సునీతకు అర్జీలు ఇచ్చారు. వారి సమస్యలను ఓపికగా వింటూ కొన్నింటికి తక్షణమే పరిష్కారం చూపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల మీద స్థానికంగా ఉన్న అధికారులు స్పందించకపోవడం, నాంచడం వల్లే ఇంత దూరం వచ్చి అర్జీలు ఇస్తున్నారన్నారు. ఇకపై ప్రజా సమస్యల విషయంలో అధికారుల నిర్లక్ష్యం ఉంటే.. చర్యలు తప్పవన్నారు.

15 మందికి సీఎంఆర్ఎఫ్, కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల ఇన్సూరెన్స్ అందజేత :

అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మొత్తం 15 మంది లబ్ధిదారులకు రూ.6.24లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే పరిటాల సునీత అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో ఎన్టీఆర్ వైద్య సేవలు అందక ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. పార్టీలో కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండాలన్న ఉద్దేశంతో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని తీసుకొచ్చారన్నారు. ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి 5 లక్షల రూపాయలు సాయం అందుతోందన్నారు. దేశంలో ఏ పార్టీ కూడా కార్యకర్తల సంక్షేమం గురించి ఈ విధంగా ఆలోచించడం లేదన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తల తరఫున అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

తుంగభద్రకు ఏపి స్టేట్ నుంచి 275 కోట్లు వచ్చింది

- బిల్స్ మంజూరులో అక్రమాలకు అవకాశం లేదు - తుంగభద్ర బోర్డు ఎస్సీ నారాయణ్‌నాయక్



నారాయణ్‌నాయక్

అనంతపురం, మే 8 ప్రభాతవార్త బ్యూరో

ఆంధ్ర-కర్ణాటక ఉమ్మడి ప్రాజెక్టు అయిన తుంగభద్ర జలాశయంకు సంబంధించి తుంగభద్ర బోర్డు పరిధిలో చేసిన ఎల్ఎల్సి, హెచ్ఎల్సి అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో అక్రమాలు, అవినీతి జరిగిందని తమపై వస్తున్న ఆరోపణలు అవాస్తవాలని తుంగభద్ర డ్యాం ఎస్ఈ నారాయణ్‌నాయక్ వెల్లడించారు. గత రెండు రోజులుగా తుంగభద్ర బోర్డులో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో జరిగిన అక్రమాల తీరు గురించి ప్రత్యేక వార్తలను వార్త దినపత్రికలో ప్రచురితమయ్యాయి. ఇందుకు సంబంధించి ఎస్ఈ నారాయణనాయక్‌ను వివరణ కోరగా పై విధంగా స్పందించారు. తుంగభద్ర బోర్డు పరిధిలో గత ఏడాది చేసిన పనులకు 459 కోట్ల రూపాయలు ఆంధ్ర వాటా కింద రావాల్సి ఉంటే 275 కోట్లు వచ్చిందని ఆ మొత్తంలోని కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. తుంగభద్ర బోర్డు పరిధిలో కేంద్ర అధికారులతోపాటు ఇరు రాష్ట్ర అధికారులతో కలిపి ఐదు మంది కమిటీ ఉంటుందని ఆ కమిటీలోనే చర్చించి బిల్లులు మంజూరు చేసేందుకు నిర్ణయాలు తీసుకుంటారని ఆయన బిల్లుల మంజూరులో ఇష్టం వచ్చినట్లు చేసేకి ఉండదని ఆయన వెల్లడించారు.

జలధార జలహారతి కింద వేగవంతంగా కొనసాగుతున్న పూడికతీత పనులు

- పనులు పూర్తయితే హెచ్ఎల్సీ కాలువలో నీటి ప్రవాహానికి తొలగనున్న అడ్డంకులు - పూడిక తీత పనులతో ఉపాధి హామీ కూలీలకు ఉపాధి

కెనాల్‌లో పూడిక తీత పనులను చేస్తున్న ఉపాధి కూలీలు

అనంతపురం, మే 8 ప్రభాతవార్త బ్యూరో

జలధార జలహారతి కార్యక్రమం కింద కెనాల్స్ లో పూడిగతీత పనులు చేపట్టడం రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. ఉపాధి హామీ కూలీలతో ఈ పనులు చేయించడం వల్ల ఎంతో ఉపయోగపడే పనులు చేస్తున్నారని రైతులు అభిప్రాయం వ్యక్తం అవుతుంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జలధార జలహారతి కార్యక్రమాన్ని అనంతపురం జిల్లాలో ప్రారంభించిన విషయం తెలిసిందే.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు గత నెల 6వ తేదీన యాడికి మండలంలో జలధార జలహారతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా.. అదే స్ఫూర్తితో జిల్లాలో జలధార జలహారతి పనులను పలుచోట్ల వేగవంతంగా చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామ పరిధిలో వెళుతున్న హెచ్ఎల్సీ కాలువలో పూడికతీత పనులు చేపట్టడం జరుగుతోంది. హెచ్ఎల్సీ కాలువలో పూడికతీత పనులు చేపట్టడం వల్ల నీటి సంరక్షణ పనులు చేపట్టడంతో పాటు వేగంగా దూసుకొచ్చే నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగి ఈ ప్రాంతంలో జలసిరులు విరబూయనున్నాయి. అనంతపురం రూరల్ మండలం తాటిచెర్ల గ్రామంలో జలధార జలహారతి కార్యక్రమాన్ని ఉపాధి హామీ పథకం కింద మొత్తం 9 పనులు మంజూరు కాగా, మొత్తం 35 లక్షల రూపాయలతో పనులు చేపట్టడం జరుగుతోంది. అందులో కాలువల పూడికతీతకు సంబంధించి 5 పనులు, డగౌట్ పాండ్లకు సంబంధించి 4 పనులు చేపట్టడం జరుగుతోంది. ఒక్క పని విలువ 9 లక్షల రూపాయలు ఉండగా, ప్రస్తుతం రెండు పనులను 18 లక్షల రూపాయల నిధులతో చేపడుతున్నారు. ఉపాధి హామీ కూలీలు ప్రతిరోజు పనులకు వస్తున్నారు. గ్రామంలో జాబ్ కార్డు లో ఉన్న ప్రతి ఒక్కరికి జలధార జలహారతి కింద పనులు కల్పిస్తున్నారు. ఇప్పటికే మూడు వారాల నుంచి పనులు చేపట్టడం జరుగుతోండగా, పనులు పూర్తయ్యే వరకు మరో రెండు నెలలు నిరంతరాయంగా పనులు కొనసాగనున్నాయి. జలధార జలహారతి వల్ల కలిగే ఉపయోగాలు ఎన్నో, ఈ కార్యక్రమం కింద హెచ్.ఎల్.సి కాలువలో రాళ్లు రప్పలు, చెత్తాచెదారం, రబ్బరు చెట్లు తొలగించడం జరుగుతోంది.దీని ద్వారా కాలువలో నీటి ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు ఎదురుకావు.కాలవలో పూర్తిస్థాయిలో నీటి ప్రవాహంతో చిన్న నీటి కాలువల ద్వారా నీరు ప్రవహించి చివరి ఆయకట్టు వరకు నీరు చేరి రైతులు పంటల పండించేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలో ప్రజలకు ముఖ్యంగా పశు సంపదకు జీవం లభించనుంది. పూడిక తీయడం వల్ల భూగర్భ జలాల పెంపొందించేందుకు, నీటి సరఫరా సజావుగా జరిగేందుకు, నీటిని నిల్వ ఉంచేందుకు, ఇలా ఎన్నో రకాల ఉపయోగాలు కలగనున్నాయి.

మాకు స్వగ్రామంలోనే కూలీ పని దొరుకుతోంది : కె.ఈశ్వరయ్య, ఉపాధి శ్రామికుడు, తాటిచెర్ల గ్రామం, అనంతపురం రూరల్ మండలం

జలధార కార్యక్రమం కింద తాము గత నాలుగు వారాల నుంచి హెచ్ఎల్సీ కాలువలో పూడికతీత పనులను చేపట్టడం జరుగుతోంది. ఒకరోజుకు 292 రూపాయల కూలీ మాకు అందుతోంది. ఇంకా నాలుగు వారాలకు పైగా ఇక్కడ పని దొరుకుతుంది. ఈ పనులు చేపట్టడం ద్వారా మాకు స్వగ్రామంలోనే వేతనం దొరకడం జరుగుతుంది. వర్షాకాలంలో కాలవలో నీరు ప్రవహించేందుకు చాలా సులభంగా ఉంటుంది. ఉపాధి హామీ కింద మాకు, మా కుటుంబానికి 100 రోజుల పని కల్పిస్తున్నారు. ఇందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

జలధార పనులతో కాలవలో వచ్చే నీరు సులభంగా వెళ్లేందుకు అవకాశం : పరందాము, ఉపాధి శ్రామికుడు, తాటిచెర్ల గ్రామం,

అనంతపురం రూరల్ మండలం జలధార పనుల కింద హెచ్ఎల్సీ కాలువలో చేపట్టిన

పూడికతీత పనులకు తాము రోజు పాల్గొంటున్నాము. కాలువలో రబ్బరు చెట్లు, కళ్ల, గడ్డి, రాళ్లు, మట్టి, తదితరాలు పేరుకుపోగా వాటిని తీసివేసే పనులను చేపడుతున్నాం. దీని ద్వారా కాలవలో వచ్చే నీరు సులభంగా వెళ్లేందుకు వీలవుతుంది. ఉపాధి పనులను మూడు వారాల నుంచి చేస్తున్నాం. మాకు రోజుకు 300 రూపాయల వరకు కూలీ లభిస్తుంది.

ప్రతిరోజు జలధార పనులు చేపడుతున్నాం : గణేష్, ఫీల్డ్ అసిస్టెంట్, తాటిచెర్ల గ్రామం,

అనంతపురం రూరల్ మండలం జలధార జలహారతి కార్యక్రమం కింద ప్రతిరోజు ఉపాధి పనులను కల్పిస్తున్నాము. గ్రామ పరిధిలోని హెచ్ఎల్సీ కాలువలో దాదాపు 18 లక్షల రూపాయలకుపైగా నిధులతో రెండు పనులను చేపట్టడం జరుగుతోంది. రోజు 120 125 మందికి పైగా కూలీలు జలధార పనులను చేపడుతున్నారు. ఉదయం ఆరు గంటలకు వచ్చినప్పుడు ఒకసారి, పనులు



ముగించుకుని వెళ్ళినప్పుడు ఒకసారి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ ద్వారా శ్రామికుల నమోదు చేపడుతున్నాం. పనుల వద్ద అన్ని రకాల మౌలిక సదుపాయాలను శ్రామికులకు కల్పిస్తున్నాము. ఇప్పటికే రెండు వారాల నుంచి పనులు చేపడుతుండగా, నెల రోజులకు పైగా ఈ పనులు కొనసాగనున్నాయి.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఉత్సవమూర్తులకు చక్రస్నానం

-వైభవంగా లక్ష్మినసింహుని శయనోత్సవం -స్వామివారి దర్శనానికి ఎగబడ్డ భక్తజనం
-నేడు ఆమిద్యాలకు తరలివెళ్లనున్న ఉత్సవమూర్తులు

ధ్వజా అవరోహణ కార్యక్రమం దృశ్యం

శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తుల చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ, మే 8 ప్రభాతవార్త

ఉరవకొండ మండల పరిధిలోని పెన్నహోబిళంలో జరుగుతున్న లక్ష్మినరసింహస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సరం బహుళ సప్తమి శుక్రవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు చక్రస్నానం, వసంతోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఉదయం సుప్రభాతం, మహాభిషేకం, అలంకరణ, బలిహరణ, మంగళహారతి కార్యక్రమాల అనంతరం ప్రధానాలయం నుండి ఉత్సవమూర్తులను మేళ తాళాలతో కొండ క్రింద వెలసిన ఉద్భవలక్ష్మి అమ్మవారి ఆలయం ముందుగల లక్ష్మమ్మ మంటపం వద్దకు చేర్చి మంటపానికి ప్రక్కనేగల కోనేరు నుండి జలాన్ని తీసుకొచ్చి చక్రస్నానం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు వసంతోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించగా స్వామివారి పల్లకీ మోసేవారితోపాటు భక్తులు రంగునీళ్లు చల్లుకున్నారు. రాత్రి ధ్వజా అవరోహణ కార్యక్రమం అనంతరం శ్రీవారి శయనోత్సవం వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవమూర్తులను ఊయల్లో కొలువుదీర్చి శయనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా క్షేత్రంలో దాసంగాల సందడి కొనసాగగా స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు బారులు తీరి కనిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ రేగటి నాగరాజు, కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా శనివారం పెన్నహోబిళం నుండి శ్రీవారి ఉత్సవమూర్తులను ఆమిద్యాల గ్రామానికి చేర్చడంతో బ్రహోత్సవాలు ముగియనున్నాయి.

చక్ర స్నానాన్ని వీక్షిస్తున్న భక్తులు

వైభవంగా ఓం శక్తి ఆలయంలో మహా కుంభాభిషేకం

ధర్మవరం పట్టణంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించండి...!

12న పామిడికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాక..?

4 >>

వ్యవసాయ శాఖ సిబ్బందికి కృత్రిమ మేధ (ఏ ఐ) వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహణ

వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్ మే 8 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం నియోజకవర్గం పరిధిలోని మండల వ్యవసాయ శాఖ అధికారులు, క్షేత్ర సాయి సిబ్బందికి కళ్యాణదుర్గం పట్టణం నందు ఎన్జీవో కార్యాలయంలో శుక్రవారం కృత్రిమ మేధా ఏ ఐ వినియోగంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. శిక్షణ తరగతులను స్థానిక ఏ డి ఏ ఎల్లప్ప ఆధ్వర్యంలో నిర్వహించి ఐదు మండలాల వ్యవసాయ శాఖ అధికార యంత్రాంగానికి ప్రత్యేక సూచనలు చేశారు. ఈ సందర్భంగా 82 మంది ఏ ఈ ఓ , వి ఏ ఏ ఎంపీఈఓ లు , ఇతర సిబ్బంది. పంట తెగుళ్ల గుర్తింపు, వాతావరణ ఆధారిత సలహాలు, మార్కెట్ ధరలు, పి ఎం కిసాన్ పంట బీమా వంటి పథకాల సమాచారాన్ని రైతులకు తక్షణమే అందించడానికి టూల్స్ ఎలా ఉపయోగపడతాయో ప్రత్యక్షంగా చూపించారు. అధికారులు మొబైల్ ఉపయోగించి రైతుల కోసం తెలుగులో వ్యవసాయ సలహాలు, పథకాల వివరాలు సరళంగా తయారు చేయడం ప్రాక్టీస్ చేశారు. కార్యాలయ పనులు వేగవంతం చేసేందుకు ఏ ఐ టూల్స్ వాడే విధానం పై ప్రత్యేక సెషన్ నిర్వహించారు. సమావేశాల్లో చర్చించిన అంశాలను రికార్డ్ చేసి ఏ ఐ సహాయంతో నిమిషాల్లో మినిట్స్ తయారు చేయడం డెమో చేశారు. సర్క్యులర్‌ను ఇంగ్లీషు నుండి తెలుగుకి, తెలుగు నుండి ఇంగ్లీషుకి తప్పులు లేకుండా అనువదించే విధానం వివరించారు. అధికారిక ఉత్తరాలు, ఫైళ్ల రహస్యంగా ఉండాలి కాబట్టి వ్యక్తిగత రైతు వివరాలు, ఆధార్ నంబర్ల వంటివి నేరుగా ఇవ్వకూడదని ఏ ఐ ఇచ్చిన డ్రాఫ్ట్‌ను సంబంధిత అధికారులు సరిచూసి, సంతకం చేసిన తర్వాతే అధికారికంగా విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఈ వర్క్‌షాప్ ద్వారా కళ్యాణదుర్గం మండల వ్యవసాయ శాఖ సిబ్బంది డిజిటల్ నైపుణ్యాలు మెరుగుపడి, క్షేత్రస్థాయిలో రైతులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు, కార్యాలయ పరిపాలన కూడా వేగవంతం అవుతుందని ఏడీఏ యల్లప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఏ ఓ లు శ్రవణ్ కుమార్ వాసుకి రాణి మహేష్ విజయ్ కుమార్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు

ఖాతాదారులకు ఇచ్చేందుకు డబ్బులు లేవు

డబ్బులు ఉంటే ఇస్తాం బ్రాంచ్ మేనేజర్

ఖాతాదారుల ఆందోళన

కనేకల్ మే 08 ప్రభాతవార్త

కనేకల్‌లోని యూనియన్ బ్యాంక్ (మాజీ ఆంధ్ర బ్యాంక్) శాఖలో శుక్రవారం నగదు కొరత, సిబ్బంది సమస్యల కారణంగా ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిజెపి నాయకులు మాల్యం చిక్కన్న ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాల్యం చిక్కన్న మాట్లాడుతూ బ్యాంక్‌లో రెన్యువల్ పనుల సమయంలో ప్రింటర్ పనిచేయకపోవడం పై ఖాతాదారులు మేనేజర్ కోదండరాం దృష్టికి తీసుకెళ్లేమన్నారు. సిబ్బంది కొరతుంటే మేనేజరు పై అధికారులకు స్పష్టంగా తెలియజేయాలి రెన్యువల్ సమయంలో రైతులు ఇబ్బంది పెట్టడమే కదా మీరు చేస్తున్న పని అన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ సిబ్బంది కొరత కారణంగా కొంత సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఖాతాదారులకు టోకెన్ విధానం అమలు చేస్తున్నామని, నగదు అందుబాటులో లేకపోవడంతో ఆలస్యం జరుగుతోందని వివరించారు. ఈ విషయంపై బీజేపీ నాయకులు చిక్కన్న మేనేజర్ ఛాంబర్‌లోకి వెళ్లి మాట్లాడగా, 1 కోటి 20 లక్షల నగదు డిస్పాచ్ అయింది. పై అధికారులతో మాట్లాడి నగదు వచ్చిన వెంటనే చెల్లింపులు చేస్తాం అని అన్నారు. నగదు రాకపోతే ఇవ్వడం సాధ్యం కాదు" అని మేనేజర్ తెలిపారు. అయితే నగదు లేకపోవడంతో ఖాతాదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బ్యాంక్ అధికారులపై ఆవేదన వ్యక్తం చేశారు. త్వరగా సమస్య పరిష్కరించి నగదు అందుబాటులో ఉంచాలని వినియోగదారులు కోరుతున్నారు.

నాయనపల్లిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

లేపాక్షి, మే 8 ప్రభాతవార్త

లేపాక్షి మండల పరిధిలోని నాయనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యాధికారిణి డాక్టర్ సాహితి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి దృష్ట్యా ఆయుర్వేదం మరియు యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు. శిబిరానికి విచ్చేసిన పలువురు రోగులకు నాడి పరీక్షలు నిర్వహించి, వారి అనారోగ్య సమస్యలకు తగిన సూచనలు చేయడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు శ్రీనివాసరెడ్డి, సుబ్రహ్మణ్యం, గోవింద్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

టీడీపీ కార్యకర్త మృతికి ఎమ్మెల్యే కాలవ సంతాపం

డి.హిరెహాళ్ మే 8 ప్రభాతవార్త

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలవ

అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన తెదేపా కార్యకర్త ఎరిస్వామి(62) భౌతికకాయానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పూలమాలవేసి నివాళులర్పించి సంతాపం వెలిబుచ్చారు. శుక్రవారం డి.హిరెహాళ్ మండలం హిర్దేహాళ్ గ్రామానికి చెందిన మృతుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన సమాచారం తెదేపా నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే మృతుడు స్వగృహం కు చేరుకొని నివాళులర్పించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే కాలవ తెదేపా మండల కన్వీనర్ పాటిల్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగల్లి రాజు, స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులను కలుసుకొని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ఎరిస్వామి పార్టీ కార్యకర్తగ సేవలందించారని, ఎన్నికల సమయంలో పోలింగ్ ఏజెంటుగా సమర్థంగా పనిచేసేవారని ఎమ్మెల్యే కాలవ గుర్తుచేసుకొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రైల్వే గేట్‌కు మరమ్మతులు

- ప్రయాణీకులకు ప్రత్నామాయం - ఎస్ఐ సురేష్‌బాబు

గుత్తి ఎస్ఐ సురేష్‌బాబు మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, మే 8 ప్రభాతవార్త

గుత్తి పట్టణం నుండి ప్యాపిలికి వెళ్లే జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో బిపిసిఎల్ గోడౌన్ వద్ద ఉన్న రైల్వే గేటుకు రైల్వే అధికారులు మరమ్మతులు చేపట్టారని ఎస్ఐ సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 9 నుండి 13 వరకు రైల్వే గేటుకు మరమ్మతులు జరగనున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు రైల్వే గేట్ పక్కన ఉన్న అండర్ రైల్వే బ్రిడ్జి కింద నుండి ప్రయాణించాలన్నారు. మినహా కార్లు, లారీలు, బస్సులు జాతీయ రహదారిపై ఉన్న కొత్తపేట బ్రిడ్జి వైపు నుండి ప్రయాణించాలని ఆయన సూచించారు. ఈ మేరకు వాహనదారులు, ప్రయాణీకులు అవగాహన కల్పించుకొని ప్రయాణించాలని ఆయన కోరారు.

బెస్ట్ యూనివర్సిటీలో...రెడ్ క్రాస్ సొసైటీ దినోత్సవ వేడుకలు

- రక్తదాన శిబిరంలో...ఛైర్మన్ భరత్‌లాల్ మీనా

గోరంట్ల, మే 8 ప్రభాతవార్త

బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో పుట్టపర్తి భారత రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బందిలో సామాజిక బాధ్యతను పెంపొందించడం, స్వచ్ఛంద రక్తదానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఛైర్మన్ భరత్‌లాల్ మీనా, చాన్సలర్ డాక్టర్ రూపా వాసుదేవన్, వైస్ చాన్సలర్ డాక్టర్ కె.నాగజ్యోతి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.ఇమ్మాన్యుయేల్ అనుపల్లి, డీన్ సిఎస్ఎఆర్ డాక్టర్ రామ్‌గోపాల్ మొవ్వూరి, డీన్ ఎస్ఏఎంఎస్ తిరులోగ సుందరం హాజరయ్యారు. భారత రెడ్ క్రాస్ సొసైటీ, పుట్టపర్తి ప్రతినిధులు భక్తవత్సలం, జి.బి. విశ్వనాథ్, బి.రమేష్, టి.సంజీవలక్ష్మిలు కార్యక్రమంలో పాల్గొన్నారు. చిక్కబళ్లాపుర, హిందూపూరం రక్త బ్యాంకుల సభ్యులు కూడా శిబిరానికి హాజరై సహకరించారు. ఈ రక్తదాన శిబిరానికి విశ్వవిద్యాలయ విద్యార్థులు మరియు అధ్యాపకుల నుండి విశేష స్పందన లభించింది. మొత్తం 53 యూనిట్ల రక్తం సేకరించారు. విద్యార్థులు మరియు సిబ్బంది చూపిన ఉత్సాహం, సేవా భావం వారి మానవతా దృక్పథాన్ని ప్రతిబింబించింది. ఈ సందర్భంగా ప్రముఖులు నిర్వాహకులు, వాలంటీర్లు, విద్యార్థులు మరియు అధ్యాపకులను అభినందిస్తూ శిబిరాన్ని విజయవంతం చేసినందుకు ప్రశంసించారు. భారత రెడ్ క్రాస్ సొసైటీ, పుట్టపర్తి ప్రతినిధులు విశ్వవిద్యాలయ యాజమాన్యానికి తమ కృతజ్ఞతలు తెలిపారు. విశ్వ విద్యాలయ చైర్మన్ భరత్‌లాల్ మీనా, చాన్సలర్ డాక్టర్ రూపా వాసుదేవన్ ప్రశంసిస్తూ విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొనాలని ప్రోత్సహించారు. "రక్తదానం జీవన దానం" అనే సందేశంతో మానవ ప్రాణాలను కాపాడడంలో స్వచ్ఛంద రక్తదానం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

12న హనుమాన్ శోభాయాత్రకు తరలిరండి

హిందు సురక్ష సేవా సమితి

కమిషనర్ ను ఆహ్వానిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్ మే 8 ప్రభాతవార్త

హిందూపురం పట్టణంలో ఈ నెల 12వ తేదీన పెద్ద ఎత్తున జరగనున్న హనుమాన్ శోభాయాత్రకు కులాలకు అతీతంగా నియోజకవర్గ ప్రజలు తరలిరావాలని హిందూ సురక్ష సేవా సమితి పిలుపునిచ్చింది. స్థానిక ప్రెస్ క్లబ్లో శుక్రవారం మధ్యాహ్నం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు సూగూరు ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణ

విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

నుంచి శోభాయాత్ర ప్రారంభమై వాల్మీకి సర్కిల్, చిన్న మార్కెట్, మెయిన్ బజార్, అంబేద్కర్ సర్కిల్, శివాజీ సర్కిల్ మీదుగా చౌడేశ్వరి కాలనీ శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం వరకు కొనసాగుతుందని చెప్పారు. తదుపరి అక్కడే ప్రజలకు అన్న సంతర్పణ ఉంటుంది అని తెలిపారు. వివిధ దేవాలయాల కమిటీలు, భజన సంఘాలు తదితర హిందువులందరూ తరలివచ్చి ఎప్పటిలానే విజయవంతం చేయాలని కోరారు. కాగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను బృందం ప్రతినిధులు కలిసి ఆహ్వానించారు. వారి విజ్ఞప్తి మేరకు మినరల్ వాటర్ సౌకర్యాన్ని శోభాయాత్ర జరిగే మార్గంలో మూడు చోట్ల ఏర్పాటు చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. సమావేశంలో బిజెపి రమేష్ రెడ్డి, చారుకీర్తి, వైటిపి శ్రీనివాసులు, నిమ్మకాయల రాము , వెంకటరమణప్ప, బిఎస్ విద్యాసాగర్, టికె బాబు, నాగరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ

గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

లేపాక్షి, మే 8 ప్రభాతవార్త

లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు రమామణి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కరణం రామానందన్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహారాన్ని అందజేశారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వెంకటచిరంజీవి గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి పలు సూచనలు సలహాలను అందజేశారు. అనంతరం రమామణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 75 మంది మాతృమూర్తులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామానందన్ మాట్లాడుతూ పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చే మాతృమూర్తులకు తన జీవితకాలం పౌష్టికాహారాన్ని అందచేస్తానని పేర్కొన్నారు. దాదాపు రెండు సంవత్సరాలుగా గర్భవతులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు కరణం రామానందన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షికి ఐమాక్స్ వెలుగులు

ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

లేపాక్షి, మే 8 ప్రభాతవార్త

మండల కేంద్రమైన లేపాక్షికి పంచాయితీ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఐమాక్స్ వెలుగులు వచ్చాయి. గత కొంతకాలంగా లేపాక్షి ప్రధాన రహదారిలోని పలు విద్యుత్ దీపాలు మరమ్మతుకు గురి కావడంతో ప్రధాన రహదారి చీకటి మయంగా ఉండేది. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు ప్రజా ప్రతినిధులకు తెలిపినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రత్యేక అధికారి పాలన వచ్చిన తరువాత పంచాయతీ కార్యదర్శులు నాగరాజుపై వీధి దీపాల ఏర్పాటు విషయంలో తీవ్రవత్తిడి వచ్చింది. ఇందుకు స్పందించిన కార్యదర్శి ఐమాక్స్ లైట్లు కొనుగోలు చేసి శుక్రవారం ఏర్పాటు చేయించారు. దీంతో లేపాక్షి ప్రధాన రహదారి ఐమాక్స్ లైట్లతో దేదీప్యమానంగా వెలుగుతోంది. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిగి మండల సర్వసభ్య సమావేశం

సమావేశంలో మండలాధికారులు, ప్రజా ప్రతినిధులు

పరిగి మే 8 (ప్రభాతవార్త)

పరిగి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సభా భవనంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ సవిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అభివృద్ధి, సమస్యలపై చర్చ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు. తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధం, ఉపాధి హామీ పనులు, పింఛన్లు, రోడ్ల మరమ్మతులు వంటి అంశాలపై సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సకాలంలో పరిష్కరించాలని ఆదేశం ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను స్వీకరించిన ఎంపీడీవో రెడ్డప్ప, సంబంధిత శాఖల అధికారులను సకాలంలో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని సూచించారు. అధికారులకు సూచనలు వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, త్రాగు నీరు అన్ని గ్రామాలకు అందేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఎంపీటీసీలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రొళ్ల మే 8 (ప్రభాత వార్త):

మండలంలోని 33/11కేవీ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. రొళ్ల సబ్ స్టేషన్ పరిధిలోని వన్నారపల్లి, హెచ్‌ఎం పల్లి, రొళ్ళ, గుడ్డు గురికిలో 11కేవీ కి సంబంధించి గ్రామాలలో నేడు ఉదయం 09 గంటల నుంచి 4.00 గంటల వరకు పైన తెలిపిన గ్రామాలలో విద్యుత్ సరఫరాలో మరమ్మత్తులు కారణంగా విద్యుత్ సరఫరాలో అంతర్నాయ ఉంటుందనీ మండల ఏఈ నిజాముద్దీన్ కోరారు.

కృత్రిమ మేధస్సును వినియోగించుకొని మెరుగైన సేవలు అందించాలి

- శిక్షణా కార్యక్రమంలో ఉరవకొండ ఏడీఏ ఎస్.సత్యనారాయణ

- కృత్రిమ మేధస్సు గూర్చి వివరించిన యంగ్ ప్రొఫెషనల్ దిలీప్ చౌదరి

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉరవకొండ ఏడీఏ ఎస్.సత్యనారాయణ

ఉరవకొండ, మే 8 ప్రభాతవార్త

కృత్రిమ మేధస్సును వినియోగించి రైతులకు మెరుగైన సేవల అందించా లని ఉరవకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్. సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్

శిక్షణకు హాజరైన వ్యవసాయ సబ్ డివిజన్‌లోని క్షేత్ర సిబ్బంది

కార్యాలయంలో శుక్రవారం ఉరవకొండ వ్యవసాయ సబ్ డివిజనల్‌లోని నాలుగు మండలాల క్షేత్ర సిబ్బందికి కృత్రిమ మేధస్సు పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఏడీఏ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో యంగ్ ప్రొఫెషనల్ దిలీప్ చౌదరి, విజన్ ప్లానింగ్ బృందం రహీం తదితరులు వ్యవసాయశాఖ ద్వారా అమలు జరుగుతున్న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్, ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షల నమూనా, ఈ-పంట నమోదు, ఇన్‌పుట్ సబ్సిడీ, వాతావరణ బీమా, ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ, ఫార్మర్ యాప్, ఎరువుల పంపిణీ తదితరాల్లో కృత్రిమ మేధస్సును వినియోగించి ఏఐ విధమైన నివేదికలు తయారు చేసుకోవచ్చు అన్న అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేదికలైన చాట్ జీపీటీ, ఫర్‌ప్లెక్సిటీ ఏఐ, గూగుల్ జెమిని ఏఐ, మైక్రోసాఫ్ట్ పైలట్స్, క్లాడ్ ఏఐ, భాషనీ ఐసీ వంటి వాటిని వినియోగించి ఈ-మెయిల్ డ్రాఫ్ట్ తయారీ, ఈ-ఆఫీస్ డ్రా తయారీ, మీటింగ్ మినిట్స్, పవర్ పాయింట్ తయారు చేయు విధానం, ఫార్మాట్స్ మార్పు, ఎక్సెల్ డేటా ఫార్మాట్, వాట్సాప్ మెసేజ్ ద్వారా నివేదికలు తయారు చేయు విధానాన్ని వివరించారు. కృత్రిమ మేధస్సు ద్వారా వ్యవసాయశాఖలో సిబ్బంది పనితీరులో మార్పు, సేవల వేగవంతం, సామర్థ్యం పెంపు, స్మార్ట్ నిర్ణయాలు మంచి సేవలు నివేదికలు అటు ప్రభుత్వానికి ఇటు రైతులకు చేరవేయడంలో గూర్చి ఏడీఏ ఎస్.సత్యనారాయణ వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఉరవకొండ ఏవో రామకృష్ణుడు విడపనకల్లు ఏవో పెన్నయ్య, బెలుగుప్ప ఏవో పృథ్వి, ఏఈవోలు భరత్‌రాజ్, కైలాష్, జోత్స్న, ప్రియాంక, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, నియోజకవర్గ విజన్ ప్లానింగ్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి వేడుకలు

అగళి, మే 8 ప్రభాతవార్త

రత్నగిరి గ్రామంలో వెలిసిన పురాతన కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారి వేడుకలు ఈ చుట్టుపక్కల ప్రాంతంలో ఎక్కడ జరగని విధంగా శుక్రవారం జరిగాయి. గతనెలరోజులనుంచి రత్నగిరి జాతర మొదలై నెలరోజులైనా ఇప్పటికీ రద్దీ కొనసాగుతోంది. నెల రోజులపాటు అమ్మకు ఘనంగా వేడుకలు నిర్వహించారు. దేవీ మూల విరాట్‌ను వివిధ రకాల పూలతో, మామిడి, అరటి తోరణాలతో అలంకరించారు. గులాబీ హారం, నిమ్మకాయల హారంతో అమ్మవారిని అలంకరించారు. మహిళలు ప్రత్యేకంగా గంగపూజ నిర్వహించడానికి నియోజకవర్గంలోని మహిళలు ఎక్కడున్నా ప్రతి యేడు వేడుకకు హాజరవడం, గంగపూజ జరపడం ఆనవాయితీ. గంగపూజతోపాటు హారతులను ఏర్పాటు చేసి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. మహా మంగళహారతి అనంతరం ఆలయ మండలి వారు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి మాలగుండ్ల

పెనుకొండ మే 8 ప్రభాతవార్త

వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీమంత్రి శంకర్ నారాయణ

మండల పరిధిలోని వెంకటగిరి పాళ్లెం కి చెందిన వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకుడు మునిస్వామి కుమారుడు అనిల్ కుమార్ వివాహ కార్యక్రమానికి శుక్రవారం మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ హాజరై వధూవరులను ఆశీర్వదించారు, ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నాయకులు పాల్గొన్నారు. రాంపురం పంచాయతీ హనుమపల్లి కి చెందిన వైఎస్ఆర్సిపి నాయకుడు ఆదినారాయణప్ప కుమారుడు శివప్రసాద్ వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే మడకశిరకు 116 రోజులు కృష్ణ జలాలు వచ్చాయి

వైసీపీ నాయకులు వాస్తవాలు మాట్లాడటం నేర్చుకోండి

తెదేపా క్లస్టర్ ఇంచార్జ్ బాలేపల్లి రాజు..



క్లస్టర్ ఇంచార్జి బాలేపల్లి రాజు

గుడిబండ మే 8 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గొల్లపల్లి రిజర్వాయర్ నుండి మొత్తం 211 రోజులు నీటిని విడుదల చేస్తే అందులో 116 రోజులు మడకశిర నియోజకవర్గానికి నీరు రావడం జరిగిందని దానిని గుర్తించి వైసిపి నాయకులు అబద్ధాలు మాట్లాడటం మాని వాస్తవాలు గ్రహించాలని గుడిబండ మండల క్లస్టర్ ఇంచార్జ్ బాలేపల్లి రాజు వైసిపి నాయకులకు సూచించారు. మడకశిర రైతాంగానికి 55 శాతం నీటిని విడుదల చేయడం జరిగిందని. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని కృషి చేసిన కారణంగా ఈ ఫలితం దక్కిందన్నారు. ఇటీవలగుడిబండ చెరువుకు హంద్రీనీవా జలాలు వచ్చింది మీ కళ్ళకు కనపడలేదా అని ఆయన వైసిపి నాయకులను ప్రశ్నించారు.. 2019 నుంచి 2024 వరకు వైసిపి పాలనలో హెచ్ ఎం ఎస్ ఎస్ కెనాల్ లో జంగిల్ క్లియరెన్స్ కానీ, కాలువలో ఉన్నపూడికతీత కాని, పంప్ హౌస్ లో గేట్లు ముట్టుకున్న పాపాన పోలేదని ఆయన వైసిపి నాయకులను ప్రశ్నించారు . ఈ విషయం. నియోజకవర్గంలో ఉన్న రైతులందరికీ తెలుసన్నారు. మడకశిర నియోజకవర్గం లో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక ఆయన చేస్తున్న అభివృద్ధి పనులలో తాము కొట్టుకుపోతామనే భ్రమలో పడి ప్రజల ముందుకు ఏదో ఒక సాకుతో రావడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న రెవెన్యూ అధికారులు

కాసుల కోసం కక్కుర్తి పడి రిజిస్టర్ భూములను సైతం ఇతరులకు కట్టబెట్టిన రెవెన్యూ అధికారులు

కూటమి ప్రభుత్వంలో ఉండి సొంత పార్టీ వారికోసం ధర్నాలు చేయాల్సి రావడం సిగ్గుచేటు

టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ముసుగు శ్రీనివాసులు

తాడిమర్రి మే 8 (ప్రభాతవార్త)

మండలంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని రిజిస్టర్ అయినభూములను సైతం ఇతరుల పేరుతో అక్రమంగా రికార్డుల్లోకి ఎక్కించి లక్షల రూపాయలు దోచుకుంటున్నారని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ముసుగుశ్రీనివాసులు టిడిపి మహిళా నాయకురాలు పోట్ల మర్రి సీతారామలక్ష్మితదితరులు రెవెన్యూ అధికారులపై మండిపడ్డారు. శుక్రవారం బాధిత రైతుల తరఫున తాసిల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి రెవెన్యూ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎం అగ్రహారం పొలం సర్వే నంబర్ 527, లో4,50 ఎకరాల భూమిని 1975 సంవత్సరంలో ఆత్మకూరు గ్రామానికి చెందిన ముసుగు చిన్నప్ప అనే వ్యక్తితోబత్తలపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన ముసుగు నారాయణస్వామి కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకోవడం జరిగిందని కొనుగోలు చేసిన రైతు నారాయణస్వామి సదరు భూమిని ఆన్ లైన్ లో ఎక్కించుకోకపోవడంతో అదే అదునుగా భావించిన ముసుగు చిన్నప్ప భార్య రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తమ భర్త పేరుతో ఉన్న భూమిని తన పేరిట అక్రమంగా ఆన్ లైన్లో ఎక్కించుకోవడం జరిగిందని అన్నారు. అనంతరం అదేభూమిని పత్రపల్లి గ్రామానికి చెందిన ఒక మహిళకు విక్రయించి బాధిత రైతునునిండా ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని తన పేరిట మార్చాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినాఅధికారుల్లో ఎలాంటి స్పందన లేదని ఆవేదన చెందారు. బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేయాల్సిన తహసీల్దార్ బాధిత రైతులతో 10 లక్షల రూపాయల లంచండిమాండ్ చేశారని అన్నారు. తహసీల్దార్ అడిగిన లంచం డబ్బులు ఇవ్వడానికి బాధిత రైతు నిరాకరించడంతో సదరు భూమినిఅక్రమంగా కొన్న వారి ద్వారా కోర్టులో దావా వేయించారని విమర్శించారు. కూటమిలో

తాహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న బాధిత రైతులు

భాగస్వామ్యులై ఉండి కూడా తమ వారి న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కార్యాలయం వద్ద ధర్నా చేయడం దురదృష్టమని అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో తాసిల్దార్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైసిపి వారికి తొత్తుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. టిడిపి నాయకులంటే ఆయనకు చులకన బావమని వారిని పూచిక పుల్లతో సమానంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోటిడిపి నాయకులు కార్యకర్తలు అధికార పక్షంలో ఉన్నామా లేక ప్రతిపక్షంలో ఉన్నామా అని చర్చించుకోవాల్సిన అవసరం వచ్చిందని అన్నారు. బాధిత రైతుల పక్షాన పోరాడుతున్నందుకు రెవెన్యూ అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై తమపైనే కేసులు పెట్టించుకు సిద్ధపడ్డారని అన్నారు. సదరు భూమిపై కోర్టులో వ్యవహారం నడుస్తుండగానే అక్రమంగా భూమిని చేయించుకున్న వారు పొలంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారని వ్యవహారం కోర్టులో ఉండగా వారు ఎలా భూమిలోకి ప్రవేశిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా రెవెన్యూ అధికారులు స్పందించి బాధిత రైతుకు న్యాయం చేయాలని కోరారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- యుజెఎసి అనంతపురము

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యుజెఎసి నాయకులు

అనంతపురం, మే 8 ప్రభాతవార్త బ్యూరో

ఎస్ఐఆర్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా నిర్వహించాలని యుజెఎసి నేతలు కోరారు. శుక్రవారం వారు యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ అనంతపురం శాఖ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ల సమగ్ర సవరణపై అవగాహన కార్యక్రమాలు నగరంలోని పలు మస్జిద్‌లలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి మస్జిద్‌లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈద్గా మస్జిద్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను మస్జీద్ ఇమామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముతవలీల సంఘం రాష్ట్ర అధ్యషులు కే.ఎం షకీల్ షఫీ, యుజెఎసి నాయకులు జాఫర్, వసీం, దాదా గాంధీ, కాగజ్ ఘర్ రిజ్వాన్, సైఫుల్లా, జావేద్, రియాజ్, సిరాజ్, షఫీతో పాటు జమాఅతే ఇస్లామీ హింద్ నాయకులు హాజీపీరా, సిరాజ్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు. త్వరలోనే సమాజంలోని ఉలేమాలు, పెద్దలు, విద్యావంతులు, మేధావులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎస్ఐఆర్‌పై సమగ్ర చర్చ జరపనున్నట్లు కె.యం. షకీల్ షఫీ మరియు జాఫర్ తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ జాఫర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ అనేది ఎన్నికల సంఘం నిర్వహించే నిరంతర ప్రక్రియ అని, సాధారణంగా మరణించిన వారి పేర్ల తొలగింపు, డబుల్ ఓటర్ల తొలగింపు, కొత్త ఓటర్ల చేర్పులు వంటి అంశాల కోసం ఈ ప్రక్రియ నిర్వహించబడుతుందని తెలిపారు. అయితే ప్రస్తుతం ఈ ప్రక్రియ కులం, మతం, రాజకీయ పార్టీల కోణంలో విభజించబడుతున్నదన్న విమర్శలు రావడం ఆందోళనకరమని అన్నారు. కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నారనే ఆరోపణలు రావడం దురదృష్టకరమని పేర్కొంటూ, ప్రజలందరూ ఎస్ఐఆర్ యొక్క అసలు ఉద్దేశాన్ని అర్థం చేసుకుని అవగాహనతో ముందుకు రావాలని కోరారు. సంబంధిత బీఎల్ఓలకు తమ గుర్తింపు కార్డులను సమర్పించి ఓట్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని, అలాగే ఫారం7 ద్వారా ఓట్ల తొలగింపు ప్రక్రియ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వాల ఒత్తిళ్ల నేపథ్యంలో దేశంలో గతంలో జరిగిన ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తిన విషయాలను ప్రస్తావిస్తూ, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తిగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఈ ప్రక్రియను నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిత్యావసర వస్తువుల అందజేత

నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

రాప్తాడు, మే 8 ప్రభాతవార్త

పేద కుటుంబాల సంక్షేమం కోసం పనిచేస్తున్న గరీబ్ కా దర్ద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ రోజు ఒక పేద కుటుంబం వివాహానికి అవసరమైన రేషన్ సామగ్రి మరియు ఇతర అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదరణ సేవా హోమ్ ట్రస్ట్‌కు చెందిన లాల్ బాషా పాల్గొన్నారు. వివాహ కార్యక్రమం సాఫీగా నిర్వహించేందుకు ఈ సహాయం పూర్తిగా ఉచితంగా అందించబడిందని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఇంకా ఒక వివాహం జరగబోతోందని, సహాయం చేయాలనుకునే వారు ట్రస్ట్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ అధ్యక్షుడు హాజీ జీలాన్ బాషా, ఉపాధ్యక్షుడు మసూద్ ఖాన్, ట్రెజరర్ అకుల అబ్దుల్ మరియు సభ్యులు , హుండాయి అలీ, సమన్వయం చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు ప్రశంసించారు.

డంపింగ్ యార్డ్‌ని వేరే చోటకి తరలించాలి

- పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి వీరేంద్ర ప్రసాద్

మాట్లాడుతున్న పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్రప్రసాద్

అనంతపురం న్యూటౌన్, మే 8 ప్రభాతవార్త

గుత్తి రోడ్‌లో డంపింగ్ యార్డ్‌ని వేరే చోటకి తరలించాలని పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్ర ప్రసాద్ కోరారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో రిటైర్డ్ ఆర్ ఐఒ కిష్టప్ప, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి వీరేంద్ర ప్రసాద్, కోశాధికారి బండారు శంకర్, పట్టణ పేదల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరనారప్ప, ఉపాధ్యక్షుడు పక్రుద్దీన్, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పీ.కిష్ట, ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ సభ్యులు ఎర్రి స్వామి పాల్గొని మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా డంపుయార్డు కొన్ని లక్షల టన్నులు పేరుకుపోయి ఉంది. కూటమి ప్రభుత్వ నాయకులు ఎన్నికల ప్రచారంలో డంప్‌యార్డును తరలిస్తామని హామీలు ఇచ్చి రెండు సంవత్సరాల పూర్తి అయిన దాన్ని తరలించే పాపాన పోలేదన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించానలి లేని యెడల రాబోయే రోజుల్లో రాజు కాలనీ పంచాయతీ ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడదామని తెలియజేస్తు ఈ కార్యక్రమంలో నాయకులు మున్నా, వలి, నాగరాజు, రాజు కాలనీ పంచాయతీ వాసులు మరియు లెక్చరర్స్ కాలనీ రెయిన్బో అపార్ట్మెంట్ వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మజ్జిగ పంపిణీ

అనంతపురం రూరల్, మే 8 ప్రభాతవార్త

పండిట్ రవి శంకర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

గురుదేవ్ పండిట్ రవి శంకర్‌జీ 70వ జన్మదిన సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారి సౌజన్యంతో అనంతపురం నగరంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ఓ.పి బ్లాక్ దగ్గర మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగినది. శుక్రవారం సమయం 11 గంటలకు డా॥మల్లీశ్వరి అనంతపురం జిజిహెచ్ సూపరింటెండెంట్, డాక్టర్ హేమలత, ఆర్ఎంఒలు కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమములో ఆర్ట్ ఆఫ్ లివింగ్ స్టేట్ టీచర్స్ కో-ఆర్డినేటర్ కర్నూలు మమత, యోగా మాస్టర్ మహేష్ మహాలక్ష్మి, రాజేష్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం కొనసాగించండి

- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, కౌలు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య

శింగనమల, మే 8 ప్రభాతవార్త

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం యదావిధిగా కొనసాగించాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని దుర్గాంజినేయ స్వామి కొండపై 8వ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహా సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఓ.నల్లప్ప, కౌలు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తిలు హాజర య్యారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ.నల్లప్ప మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని గ్రామాల్లో పని అడిగిన వారికి ఉపాధిహామీ పని కల్పించాలన్నారు. సంవత్సరంలో 200 రోజులు పనిదినాలు కల్పిస్తూ 600 రూపాయలు కూలీ ఇవ్వాలన్నారు. పని చేసే చోట కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సూరి, కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, జిల్లా అధ్యక్షులుగా తరిమెల భాస్కర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు రామాంజినేయులు, సహాయ కార్యదర్శి ఎరిస్వామి, సూర్య ప్రకాష్, చంద్రశేఖర్, ఓబులేసు, నిర్మల, శ్రీనివాసులు, హరిదాసు, సంజీవరాయుడు, గిరి, నాగప్ప పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీలకు శిక్షణ అందించండి

అనంతపురం సిటీ, మే 8 ప్రభాతవార్త

జిల్లాలో ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శ కంగా, సమర్ధ వంతంగా జరిగేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని వైసిపి బూత్ కమిటీ జిల్లా అధ్య క్షులు ఎద్దుల అమర్‌నాథ రెడ్డి, నగరాధ్యక్షులు చింత సోమశేఖర్‌రెడ్డిలు, డిఆర్ఓ మలోలాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీలకు శిక్షణను అందించాలని సూచించారు. తద్వారా పారదర్శకంగా ఓటర్ల జాబితా జరిగేందుకు దోహదపడుతుందన్నారు. అదే విధంగా డిజిటల్ ఓటర్ జాబితాను అందించాలని సూచించారు. దీంతోపాటు నవీకరించిన బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓ)లు వివరాలను రాజకీయ పార్టీలకు అందించాలని వారు సూచించారు.

డిఆర్ఓకు వినతిపత్రం అందిస్తున్న వైసిపి నేతలు

కిషోర్ బాలికలు..వికాస తరంగాలు !

రాప్తాడు, మే 8 ప్రభాతవార్త

ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని రాప్తాడు-2 అంగన్వాడి కేంద్రంలో కిషోర్ బాల బాలికలను సమావేశ పరచి ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన "కిషోరీ వికాసం" 2026. వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమాలలో భాగంగా మే 1వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు కిషోరి వికాసం కార్యక్రమం జరుపబడుతుందని తెలియజేస్తూ ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బాల బాలికలకు ఆరోగ్యం, అనీమియాపై అవగాహన కల్పించారు. కిషోర్ బాలికలు యుక్తవయసులో తీసుకోవలసిన పౌష్టికాహారము, వ్యక్తిగత పరిశుభ్రత గురించి మంచి ఆహారంలో భాగంగా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలతో తయారుచేసిన లడ్డూలను తీసుకోవలెన నీ రక్తహీనత రాకుండా తమను తాము కాపాడుకోవాలని అవగాహన కల్పించడమైనది. బాల్యవివాహాలు గురించి అవగాహన కల్పిస్తూ చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలను, నష్టాలను తెలియజేయడమ్ జరిగింది. ఎక్కడైనా బాల్య వివాహము జరుగుతున్నట్లయితే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 100 పోలీస్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయవలెనని అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో బాల్య వివాహ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఐసిపి అవుట్ రీచ్ వర్కర్ కమలాక్షి, ఐసిడిఎస్ సూపర్వైజర్ లీలావతి, అంగన్వాడి టీచర్లు విజయలక్ష్మి, లక్ష్మిదేవి, సావిత్రి, భారతి, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ ట్రస్టు ద్వారా గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం



గర్భవతులకు అన్నం వడ్డిస్తున్న ఎస్ఐ చెన్నయ్య

తలుపుల, మే 08, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారంగర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించడం జరిగిందని ట్రస్టు సభ్యుడు మన్సూర్ తెలిపారు. ఈ కార్యక్రమానికిముఖ్యఅతిథిగా తలుపుల మండల ఎస్సై చెన్నయ్య హాజరు కావడం జరిగింది. ఎస్సై చెన్నయ్య మాట్లాడుతూ చాలా దూర ప్రాంతాల నుండి వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు వస్తున్న గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించడం చాలా మంచి కార్యక్రమం అని ఇలాంటి మంచి సేవ కార్యక్రమాలు చేస్తున్న ఫ్రెండ్స్ ట్రస్టుకు అభినందనలు తెలిపారు. ఫ్రెండ్స్ ట్రస్ట్ చైర్పర్సన్ మన్సూర్ ముఖ్య అతిథి ఎస్ఐ చెన్నయ్య గారికి దేవుని చిత్రమపటాన్ని అందించడం జరిగింది. గర్భవతులకు, ఆశా వర్కర్లకు వైద్య సిబ్బందికి సుమారుగా 140 మందికి భోజన సదుపాయం కల్పించడం జరిగినది. ఎండ తీవ్రత ఎక్కువ ఉండటం వల్ల మజ్జిగను కూడా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య అధికారి డాక్టర్ అల్తాఫ్, హోమియోపతి అధికారి లక్ష్మీ నరసయ్య, మండల మలేరియా అధికారి భాష, సూపర్వైజర్లు రామ్మోహన పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తులకు జరిమానా

తాడిపత్రిఅర్బన్, మే 8 ప్రభాతవార్త

తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తులకు తాడిపత్రి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ప్రభావతి జరిమానా విధించినట్లు రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కడప జిల్లా ముద్దనూరుకు చెందిన టిప్పర్ డ్రైవర్ ఉమామహేష్, తాడిపత్రి మండలానికి చెందిన ద్విచక్రవాహనదారుడు లోకనాథ్‌లు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడడం జరిగిందన్నారు. వారిని కోర్టుకు హాజరు పర్చగా ఒకరికి 8 వేలు, మరొకరికి 7 వేల రూపాయల చొప్పున జరిమానా విధించడం జరిగిందన్నారు. కావున ఎవరైనా డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు.

రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చనలు

రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని,బుగ్గరామలింగేశ్వరస్వామిని అలంకరించిన దృశ్యం

తాడిపత్రిటౌన్, మే 8 ప్రభాతవార్త

పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలోని రాజరాజేశ్వరిదేవికి శుక్రవారం కుంకుమార్చనలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అర్చకులు ఎం.యోగానందకుమార్‌శర్మ, రామకృష్ణశర్మలు బుగ్గరామలింగేశ్వరునికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేక ంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మలు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, కమిటీ సభ్యులు చవ్వా రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి

-కిశోర బాలికలకు సిడిపిఒ పిలుపు

అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ షాజిదాబేగం

తాడిపత్రిటౌన్, మే 8 ప్రభాతవార్త

బాల్య వివాహాలకు దూరంగా వుండాలని సిడిపిఒ షాజిదాబేగం కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. శుక్రవారం పట్టణంలోని 8వ వార్డు పురపాలక ప్రాథమిక పాఠశాలలో సిడిపిఒ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలబాలికలకు బాల్య వివాహాల నిర్మూలన, రక్తహీనత నివారణ, ఆత్మరక్షణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకోకుండా కేవలం చదువుపై శ్రద్ధ చూపి మంచి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతూ ఉంటే వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. కౌమార దశలో ఐరన్ లోపం వల్ల రక్తహీనత వస్తుందని, దీనివల్ల అలసట, బలహీనత, చర్మం పాలిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. నివారణకు ఐరన్ అధికంగా ఉండే మాంసం, గుడ్లు, ఆకుకూరలు, సిట్రస్ పండ్లు తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని, నులిపురుగుల మందులు, ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు క్రమం తప్పకుండా వాడాలన్నారు. అనంతరం మెడికల్ సిబ్బంది విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. విద్య, ఆరోగ్యం, పోషకాహారం, ఫోక్సో చట్టం, వృత్తి విద్య, జీవనోపాధి వంటి అంశాలపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రసూల్‌బీ, సూపర్‌వైజర్లు ఉమాదేవి, రామలక్ష్మి, నాగేశ్వరి, డాక్టర్ యశస్విని, జిఎంఎస్‌కె హేమలత, అఫ్రీన్, మెడికల్ సిబ్బంది నాగరత్న, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల దాణా కావాల్సిన వారు పేర్లు నమోదు చేసుకోండి

పుట్లూరు, మే 8 ప్రభాతవార్త

అనంత పాలధార కార్యక్రమంలో భాగంగా పశువుల దాణా కావాల్సిన పాడిరైతులు రైతు సేవాకేంద్రాల్లో పశుసంవర్ధకశాఖ సిబ్బందిని సంప్రదించి ముందస్తుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని పశువైద్యాధికారి జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్‌లో 50 కిలోల పశువుల దాణా బస్తా 1350 రూపాయలు ఉండగా రైతులకు 1125 రూపాయలకు అందించడం జరుగుతుందన్నారు. ఈ దాణా పాడి పశువులకు వేయడం వలన అధిక పాలఉత్పత్తితో పాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

బంగారు గొలుసు దొంగ అరెస్టు..

నార్పల, మే8, ప్రభాతవార్త

దొంగను చూపుతున్న పోలీసులు

నార్పల మండలం సుల్తాన్ పేట కాలనీలో 5 తేదీ నంద్యాల నరసమ్మ (భర్త శ్రీరామ్ రెడ్డి)అనే మహిళ మెడలో బంగారు గొలుసు దొంగలించిన దొంగను అరెస్ట్ చేసినట్లు నార్పల ఎస్ ఐ సాగర్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ నిందితుడు మద్యానికి, జూదము, బెట్టింగులకు అలవాటు పడిన రాయల తరేష్, (అలియాస్) రాజు, 36 సంవత్సరాలు తండ్రి రాయల్ రవికుమార్ బ్రహ్మసముద్రం మండలం రాయలప్ప దొడ్డి చెందిన వ్యక్తి చేతిలో డబ్బులు లేక ఎలాగైనా సులభంగా డబ్బులు సంపాదించాలని ఒంటరి మహిళల లక్ష్యంగా చేసుకొని వారి వద్దకు వెళ్ళి కత్తి లాంటి మరణాయుదాలతో వారిని బెదిరించి వారి వద్ద నుండి బంగారాన్ని లాక్కొని పోయి అమ్ముకొని, తనకు వున్న వ్యసనాలతో జల్సాలు చేస్తుంటాడన్నారు. ఆ ఉద్దేశంతో సదరు మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసుని దొంగిలించడానికి పాల్పడినాడు. సదరు కేసులో ముద్దాయిని 8 వ తేదీ శుక్రవారం అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి ఒక బంగారు చైను, మోటారు సైకిల్, ఒక కత్తి స్వాధీనం చేసుకుని ముద్దాయిని రిమాండ్ కు తరలించారు.

ఆక్స్ఫర్డ్ గ్లోబల్ స్కూల్ పైతప్పుడు ప్రచారాలు

యాజమాన్యం ఖండన

ముదిగుబ్బ మే 8 ప్రభాతవార్త

సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభించనున్న ఆక్స్ఫర్డ్ గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం స్కూలుకు సంబంధించిన అనుమతులపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను పాఠశాల యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. విద్యాశాఖ నిబంధనలకు అనుగుణంగా అన్ని అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసి పాఠశాల నిర్వహణ కొనసాగుతుందని యాజమాన్యం స్పష్టం చేసింది. పాఠశాల ఏర్పాటు ప్రక్రియ పూర్తిగా చట్టబద్ధంగా జరుగుతుండగా ముదిగుబ్బలో ఇప్పటికే నిర్వహిస్తున్న కొన్ని ప్రైవేటుపాఠశాలల యాజమాన్యాలకు చెందిన వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని యాజమాన్యం ఆరోపించింది. సంస్థ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే సోషల్ మీడియా వేదికగా అసత్య కథనాలు ప్రచారం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఇటువంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని పాఠశాల మేనేజ్మెంట్ విజ్ఞప్తి చేసింది. ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన. అనుభవజ్ఞులైన సీనియర్ ఉపాధ్యాయులతో బోధన అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసినట్లు యాజమాన్యం తెలిపింది. విద్యా విధానాలతో పాటు పాఠశాల విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఆక్స్ఫర్డ్ గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రారంభం వల్ల ముదిగుబ్బలో విద్యారంగంలో ఆరోగ్యకరమైన పోటీ ఏర్పడుతుందని భావనతో కొందరు ఉద్దేశపూర్వకంగా అపోహలు సృష్టిస్తున్నారని యాజమాన్యం వెల్లడించింది. త్వరలోనే విద్యాశాఖ నుండి పూర్తి అనుమతులు పొందిన అనంతరం పాఠశాలను అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సిండికేట్ నగర్ మహిళ హత్య కేసు నిందితుడు అరెస్ట్

అనంతపురం రూరల్, మే 08 ప్రభాతవార్త :

సమావేశం లో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

అనంతపురము రూరల్ మండలం సిండికేట్ మహిళ రాధ హత్య కేసు లోని నిందితుడిని అరెస్ట్ చేశామని రాప్తాడు సీఐ సి. వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితుడి వివరాలను ఆయన విలేఖర్ల సమావేశం లో వివరించారు. సిండికేట్ నగర్ నివాసం వున్న కుచీ రాధా, వయస్సు 53 స,,రాలు, భర్త లేట్ కె. రవిచంద్ర నాయుడు అను ఆమెతో చెరుకూరి ఆదినారాయణ అను అతను వివాహితర సంబంధం పెట్టుకొని, ఒంటరిగా వున్న రాధ తో సహజీవనం చేస్తూ ఇద్దరి మధ్య ఈ మధ్య కాలంలో మనస్పర్థలు ఏర్పడి ఏప్రిల్ 16 వ తేదీన మధ్యాహ్నం హైదరాబాద్ లో ఉన్న తన కూతురు ఇంటి నుండి అనంతపురముకు వచ్చిన రాధా తో ఆదినారాయణ గొడవ పడి, గొంతుకు టావాలు బిగించి చంపి, ఆమె సెల్ ఫోన్ తీసుకొని ఇంటి బయట తాళం వేసి, మరుసటి దినం ఏప్రిల్ 17 ఉదయం రాధ ను చంపిన విషయం బెంగళూరు లో వున్న ఆమె కోడలికి మరియు హైదరాబాద్ లో వున్న ఆమె కూతురు కి ఫోన్ చేసి రాధ ఫోన్ నుండి, ఫోన్ చేసి చెప్పడం వలన వారందరూ వచ్చి చూసిన తరువాత రాధ కుమారుడు కుచీ సందీప్ కుమార్ చౌదరి ఫిర్యాదు మేరకు ఆదినారాయణ పై అనంతపురము రూరల్ పోలీస్ స్టేషన్ నందు క్రైమ్.నెంబర్.87/2026 గా హత్య కేసు నమోదు అయినది. అప్పటి నుండి పరారీలో వున్న ఆదినారాయణ ను పోలీస్ గాలింపులో భాగంగా ఈ నెల 7 వ తేదీన సాయంత్రం 4. గంటల సమయంలో సిండికేట్ నగర్, బళ్ళారి అనంతపురము రోడ్డు లో అరెస్ట్ చేసి, అతని నేర ఒప్పుదల లో, ముద్దాయి ఆదినారాయణ కు మరియు రాధ కు మధ్య వున్న అక్రమ సంబందం విషయం ఆమె భర్త రవి చంద్ర నాయుడు కు తెలిసినందున, వారి అక్రమ సంబందానికి అడ్డుగా వున్న ఆమె భర్త రవి చంద్ర నాయుడు ను అడ్డు తొలగించుకోవాలని పథకం పన్ని 20.05.2025 వ తేదీన రాత్రి సుమారు 09.00 గంటల సమయంలో ఇద్దరూ కలిసి రవి చంద్ర నాయుడును మొఖం పై దిండు వేసి ఊపరి ఆడకుండా చేసి చంపినారాని, రాధ పిల్లలకు తండ్రి మరణం అనారోగ్యంతో జరిగినదని అప్పటిలో చిత్రీకరించినట్లు నేరం ఒప్పుకున్నారు. అతని నుండి ముద్దాయి రెండు సెల్ ఫోన్లు మరియు రాధ / మృతురాలు సెల్ ఫోన్ ను స్వాదీనంచేసుకున్నామన్నారు. రాధా హత్య కేసులో అరెస్ట్ కాబడిన ఆదినారాయణను శుక్రవారంరిమాండ్‌కు పంపించమన్నారు. ముద్దాయి నేర ఒప్పుదల పై రాధా కుమారుడు సందీప్ కుమార్ చౌదరి యొక్క ఫిర్యాదు మేరకు, క్రైమ్ నెంబర్.122/2026 గా హత్య కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తునిమిత్తంఅనంతపురము రూరల్ మండలం తహశీల్దార్, డాక్టర్, అసిస్టెంట్ సైంటిఫిక్ టీం మరియు పోలీస్ ల సమక్షంలో మృతుడు రవి చంద్ర నాయుడు శవాన్ని వెలికి తీసి శవ పంచానామ నిర్వహించమని అయన తెలిపారు.

గ్రామ పరిశుభ్రత ప్రజలందరి బాధ్యత

- డిప్యూటీ ఎంపీడీవో వెంకట్ నాయుడు

అనంతపురం రూరల్, మే 08 ప్రభాతవార్త

స్వచ్ఛరథం కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం రూరల్ మండలం కామారుపల్లి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం గ్రామ ప్రజలందరికీ బాధ్యతని డిప్యూటీ ఎంపీడీవో వెంకట్ నాయుడు, పంచాయతీ అభివృద్ధి అధికారి దివాకర్ తెలిపారు. శుక్రవారం గ్రామపంచాయతీలో స్వచ్ఛరథంకార్యక్రమాన్ని పంచాయతీ అభివృద్ధి అధికారి దివాకర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఎంపీడీవో వెంకట్ నాయుడు హాజరై పంచాయతీ కార్మికులు గ్రామాలలో చేపడుతున్న స్వచ్ఛ రథం కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామము శుభ్రత ప్రజలందరూ బాధ్యతగా తీసుకొని చెత్తను గ్రామంలో ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామంలోని పంచాయతీ కార్మికులు ఇంటి వద్దకు వచ్చినప్పుడు వారికి తడి పొడి చెత్తను వేరువేరుగా అందించి గ్రామాన్ని పరిశుభ్ర గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా శుభ్రమైన గ్రామం, ఆరోగ్యమైన కుటుంబం కోసం గ్రామానికి స్వచ్ఛ రథం వచ్చినప్పుడు ప్లాస్టిక్ వస్తువులు, కాగితాలు, లోహపు గాజులు అందించి స్వచ్ఛ రథం నుంచి ఇంటిలోకి కావలసిన నిత్యవసర సరుకులు పొందాలన్నారు. అనంతరం రెండు గ్రామాల రహదారిలో గల చెత్తను పంచాయతీ కార్మికులతో శుభ్రం చేయించి వాటిని చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐ ద్వారా పనితీరును మెరుగుపరుచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంచార్జ్ ఏ డి ఏ వెంకట్ కుమార్

అనంతపురం రూరల్, మే 08 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలోని అన్ని శాఖలలో రోజువారి కార్యకలాపాలలో ఏ ఐ ని వినియోగించుకొని పని తీరును మెరుగుపరుచుకునే విధంగా జిల్లాలోని అన్ని శాఖలలోని సిబ్బందికి ఆన్ ఐ సి ద్వారా ఏ ఐ పైన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారాని అందులో భాగంగా శుక్రవారం జిల్లాలోని వ్యవసాయ శాఖ సంబంధించినటువంటి డివిజనల్ స్థాయిలో శిక్షణ కార్యక్రమమునునిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అనంతపురం సబడివిజన్ కు చేసినవ్యవసాయఅధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతు భరోసా కేంద్రం సిబ్బంది మరియు సంబంధిత ఏ డి ఏ ఆఫీస్, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగాఅనంతపురం సబ్ డివిజన్ ఏడిఏ వెంకట కుమార్ మాట్లాడుతూ ఏ ఐ వినియోగం ద్వారా చీడపీడలను గుర్తించడమే కాకుండా వాటికి తగినటువంటి పురుగు తెగుళ్ళ మందులను కూడా తెలుసుకొని రైతులకు సలహాలు ఇవ్వడానికి అవకాశం ఉంది కావున సిబ్బంది రోజు వారి కార్యక్రమాలలో ఏ ఐ వినియోగాన్నిఉపయోగించుకొని పనితీరును సమర్థవంతంగా నిర్వహించగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికార్లు సోమశేఖర్, శుభకర్ మరియు కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

తలుపుల, మే 08, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు డి.ఎస్.పి శివన్నారాయణ స్వామి పర్యవేక్షణలో, ఎస్సై చెన్నయ్య ఆధ్వర్యంలో గాలి వాండ్లపల్లి గ్రామ శివారులో జూదం నిర్వహిస్తున్న స్థావరంపై ఎస్సై చెన్నయ్య తన సిబ్బందితో దాడి నిర్వహించి నిర్వాహకుడు సహా పలువురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.25 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో జూదంలో పాల్గొన్న పలువురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెన్నయ్య తెలిపారు . జూదం నిర్వహిస్తున్న నిర్వాహకుడిని సైతం అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా జూదం, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

గాండ్లపెంట మే 8 ప్రభాతవార్త

మండలంలోని సాదులపల్లిలో వెలసిన బోగతమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మగారి ఉత్సవాలను ప్రారంభించారు ఈ సందర్భంగా భక్తులకు అన్ని సదుపాయాలను కనిపించారు అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా శనివారం భజన కార్యక్రమం మరియు అదే రోజు రాత్రి అమ్మవారి ఊరేగింపు జరుగుతుంది ఈ కార్యక్రమానికి మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు

04ATP13_04ATP13.qxd 08-05-2026 PM 10:45 Page 1

తహశీల్దార్ కార్యాలయ నవీకరణ పనులు వేగంగా పూర్తీ చేయండి

-పనుల పరిశీలనలో ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించిన మంత్రి పయ్యావుల కేశవ్

తహశీల్దార్ కార్యాలయ పాత భవన సముదాయం నవీకరణ పనులను పరిశీలించి వస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, మే 8 ప్రభాతవార్త

తహశీల్దార్ కార్యాలయ నవీకరణ పనులను వేగవంతంగా పూర్తీ చేయాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని బ్రిటీషు హయం 1910 నిర్మించిన తహశీల్దార్ కార్యాలయ భవన సముదాయం నవీకరణ పనులు మంత్రి ఆదేశాలతో ఇటీవల ఆర్‌అండ్‌బీ ఆర్కెటెక్ట్ విభాగం ఆధ్వర్యంలో ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే శుక్రవారం మధ్యాన్నం మంత్రి పయ్యావుల కేశవ్ భవన సముదాయం నవీకరణ పనులను స్వయంగా పరిశీలించి ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణకు పలు సూచనలు చేశారు. పనులు మరింత వేగవంతం చేయాలని ఇందుకోసం అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పనుల విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణకు సూచనలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ధర్మవరం పట్టణంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించండి...!

ప్రజా దర్బార్ లో పలు సమస్యలపై శ్రీరామ్ కు వినతులు...!

రూ.5.92 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన శ్రీరామ్...!

అర్జీలు స్వీకరిస్తున్న పరిటాల శ్రీరామ్,

ధర్మవరం,మే8,ప్రభాతవార్త

ధర్మవరం పట్టణంలోని చాలా కాలనీల్లో విద్యుత్ సమస్యలు ఉన్నాయని.. వాటి పరిష్కారం దిశగా అధికారుల చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ సూచించారు. ధర్మవరం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు కాలనీల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ఇందులోముఖ్యంగా విద్యుత్‌సమస్యలు ఎక్కువ గా ఉన్నాయి. విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు వంటి సమస్యల గురించి శ్రీరామ్ కు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, భూసమస్యలు, పింఛన్లువంటి వాటిపై కూడా అర్జీలు ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరంపట్టణంలో ఇటీవల ఎక్కువగా విద్యుత్ సమస్యలు కనిపిస్తున్నాయని.. వాటిపైనే ప్రజలు ఎక్కువగా అర్జీలు ఇచ్చారన్నారు. ప్రజలు ఎక్కువగా విధ్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటి పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నా రు. సమస్య తెలిసిన వెంటనే అధికారులు దృష్టికి తీసుకెళ్తున్నామని ఆయన వివరించారు. పట్టణంలో చాలా చోట్ల డ్రైనేజీ సమస్యలు కూడా కనిపిస్తున్నాయని... మున్సిపల్ అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు. పింఛన్లు, రేషన్ కార్డులు త్వరలోనే మంజూరయ్యే అవకాశం ఉందని.... ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శ్రీరామ్ తెలిపారు... సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన శ్రీరామ్ధర్మవరం నియోజకవర్గంలోని పలువురికి పరిటాల శ్రీరామ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ, బత్తలపల్లి మండలాలతో పాటు పట్టణానికి చెందిన మొత్తం 15 మందికి రూ.5.92 లక్షలు విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు పరిటాల శ్రీరామ్ తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో 23 నెలల్లో 375 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందించినట్లు చెప్పారు. మొత్తం 2 కోట్ల 40లక్షల రూపాయల సాయం అందిందన్నారు. గతంలో ఎప్పుడు ఈ విధంగా సాయం అందించిన దాఖలాలు లేవన్నారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదారంగా స్పందిస్తున్నారని.అడిగిన వెంటనే తగిన సాయం చేస్తున్నారని అన్నారు. వైద్యం విషయంలో ఏ ఒక్కరు ఇబ్బంది పడకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశం అని శ్రీరామ్ స్పష్టం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న శ్రీరామ్

క్వారీల్లో వడ్డెర్లకు 33 శాతం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం..

వడ్డెరల తరపున ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు

వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు

కొత్తచెరువు మే 8 ప్రభాతవార్త

రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు.

వడ్డెర సామాజిక వర్గానికి మెరుగైన జీవనోపాధి మరియు స్వయం ఉపాధి కోసం సామాజిక ఆర్థిక పురోగతి కల్పించడం కోసం క్వారీ లీజులలో 15 నుంచి 33 వడ్డెర్లకు కేటాయించడం పట్ల వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సహకార శాఖ ఒక్కొక్కటి 25 మంది సభ్యులతో కూడిన వడ్డెర సహకార సంఘాలు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు,గనులు మరియు భూగర్భ శాఖ , బీసీ సంక్షేమ శాఖ, ఎమ్మెస్ ఎం ఇ శాఖ సహకార శాఖ ద్వారా వడ్డెర్లకు పూర్తిస్థాయి సాధికారత మరియు తోడ్పాటు అందించడం రాష్ట్ర ప్రభుత్వం తదితర అంశాలలో వడ్డెర్లకు ప్రాధాన్యత కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే నారా లోకేష్ కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి ఈ మంత్రి వల్లె రఘునాథ్ రెడ్డి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కి వడ్డెర్ల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు

మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలు

కొత్తచెరువు మే 8 ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లాలోని 11 మహాత్మా జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 202627 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని జిల్లా కన్వీనర్ మరియు ప్రిన్సిపాల్ ఆర్. జమున బాయి ఒక ప్రకటనలో తెలిపారు.5వ తరగతి (ఫేజ్1 సీట్లు కేటాయింపు) అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 15. లోపు సంబంధిత పాఠశాలల్లో అడ్మిషన్ పొందాలి. విద్యార్థులు తమ వెంట అవసరమైన ధృవపత్రాలను తీసుకురావాలి. మరిన్ని వివరాల కోసం 9440111302 నంబర్‌ను సంప్రదించవలేను.

రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానం..

కొత్తచెరువు మే 8 ప్రభాతవార్త.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు సబ్సిడీతో కూడిన వివిధ రకాల వ్యవసాయ పనిముట్లు ట్రాక్టర్లతో నడిచే పనిముట్లు, స్ప్రేయర్లు, హార్వెస్టర్లు, ట్రాక్టర్స్ రైతులకు అందించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సతీష్ బాబు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీతో అందించడం జరుగుతుంది అలాగే ఇతర రైతులకు 40 సబ్సిడీతో అందించడం జరుగుతుంది. మండలంలోని వ్యవసాయ పనిముట్లు కావలసిన రైతులు తమ సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో గాని లేక సొంతంగా గాని అప్లై చేసుకోవడానికి అవకాశం కల్పించడం జరిగింది. ఈనెల 19వ తారీకు వరకు ఈ అవకాశం ఉంది. ఎక్కువమంది రైతులు అప్లై చేసుకుంటే జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా రైతులను ఎన్నుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

12న పామిడికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాక..?

అనంతపురం, మే 8 ప్రభాతవార్త బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 12వ తేది అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఏడిసిసి బ్యాంకు మాజీ అధ్యక్షులు పామిడి వీరాంజినేయులు (వీర) కుమార్తె ఎం.లిఖిత వివాహ రిసెప్షన్ పామిడిలో జరగనుంది. కర్నూలు జిల్లా ఆధోనికి చెందిన ఎమ్మెల్సీ డా.ఎ.మధుసూధన్ కుమారుడు ఎ.చైతన్య మిత్రతో పామిడి వీర కుమార్తె ఏడిసిసి మాజీ చైర్మన్ అయిన ఎం.లిఖితతో 8వ తేదిన తిరుపతిలో వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎ.మధుసూధన్, ఏడిసిసి బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజినేయులు వైసిపిలో ఉండటంతో వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి 12వ తేదిన పామిడికి మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నట్లు వైసిపి వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 10వ తేదిన విదేశీ పర్యటన ముగించుకుని లండన్ నుంచి ఇండియాకు మాజీ సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి వస్తున్నట్లు సమాచారం. అనంతపురం జిల్లా పర్యటనకు మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నట్లు అధికారికంగా ఆ పార్టీ ముఖ్యులు ప్రకటించాల్సి ఉంది. ఇదిలా ఉండగా పామిడిలో ఏడిసిసి బ్యాంకు మాజీ అధ్యక్షులు వీరాంజినేయులు, ఆయన మద్దతు దారులు మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తారనే కారణంతో వివాహ రిసెప్షన్ ఏర్పాట్లను భారీగా చేయడంతోపాటు ప్లెక్సీలు కూడా వేసినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సిటీ, మే 8 ప్రభాతవార్త

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. ఇటీవల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గుజ్జల సురేష్ శుక్రవారం వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తనను కమిటీలో నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందని ఎన్నికల్లో వచ్చిన ఏ హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చ ఏస్తున్నారన్నారు. వైసిపి హయాంలో ప్రతి కుటుంబానికి మేలు చేకూరిందన్నారు. కూటమి పాలనకు, వైసిపి పాలనకు తేడాను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో వైసిపిని అధికారంలోకి తెచ్చేలా ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గౌస్‌బేగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాసరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లెల వేణుగోపాల్, పార్టీ సీనియర్ నాయకులు నాగిరెడ్డిపల్లి రామసుబ్బారెడ్డి, బళ్లారి లక్ష్మినారాయణ, నాయకులు జాఫర్‌వలి, అశోక్, మహ్మద్ రఫిలతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

లక్ష్మినరసింహస్వామి బ్రహోత్సవాలు విజయవంతం అయ్యాయి

- పయ్యావుల కుటుంబం సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు

- ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు

ఉరవకొండ, మే 8 ప్రభాతవార్త

ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు

గతనెల 28వ తేదీ నుండి ప్రారంభమై 12 రోజులపాటు కొనసాగిన లక్ష్మినరసింహ స్వామి బ్రహోత్సవాలు విజయవంతం అయ్యాయని ఇందుకు పయ్యావుల కుటుంబం చొరవ, సహకారానికి ఆలయం, ధర్మకర్తల మండలి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేతం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దివంగత మాజీ ఎమ్మెల్యే పయ్యావుల వెంకటనారా యణప్ప మోదలు ఆలయం అభివృద్ధికి, స్వామివారి సేవకు వేసిన పునాదితో నేటికీ ఆ కుటుంబం అదే భక్తి, అంకితభావం కొనసాగిస్తూ ఆదర్శవంతంగా నిలుస్తోందన్నారు. తరతరాలుగా పెన్నహోబిళ క్షేత్రంతో ఆధ్యాత్మిక అనుబంధాన్ని కొనసాగిస్తూ స్వామివారి సేవను కుటుంబ ధర్మంగా భావించి సేవ చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకొని అందించిన సహకారం, చూపిన మార్గదర్శనంతోనే బ్రహోత్సవాలు విజయవంతం అయ్యాయన్నారు. భక్తులకు తాగునీటి వసతులు, చలువ పందిళ్లు, విద్యుత్ సదుపాయం, రథోత్సవ ఏర్పాట్లు, భద్రతా చర్యలు వివిధ శాఖల సమన్వయం, దేవస్థానం అభివృద్ధి పనులు వంటి ప్రతి అంశంలో వారి ప్రత్యేక శ్రద్ధ ఉత్సవాలను చిరస్మరణీయంగా నిలిపాయన్నారు. బ్రహోత్సవాల విజయవంతానికి జిల్లా అధికార యంత్రాంగం, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక, ఆర్‌డబ్ల్యూఎస్, రవాణా, దేవాదాయశాఖ అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని అందించిన సేవలు అమోఘం అన్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, దాతలు, మీడియాకు ఈ సందర్భంగా ఈవో సాకే రమేష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు చిన్నపిల్లలపై జరుగుతున్న నేరాలపై అవగాహన సదస్సు

బ్రహ్మసముద్రం మే 8 ప్రభాతవార్త

ఎస్సై సాయికుమార్

బ్రహ్మసముద్రం మండలంలో ఉన్న మహిళలకు 09 తేదీ శనివారం బ్రహ్మ సముద్రం మండలం వేపులపర్తి గ్రామము లోని రంగనాథ స్వామి దేవస్థాన ము నందు మహిళలు చిన్న పిల్లల పై జరుగు నేరాల గురించి అవగా హన సదస్సు ను అనంతపురము మహిళా డీఎస్పీ కళ్యాణదుర్గం డిఎస్పి ఆధ్వర్యంలో మహిళలు చిన్నపిల్లలపై జరుగుతున్న నేరాలు అత్యాచారాలపై అవగాహన కార్యక్రమం కు బ్రహ్మ సముద్రం మండలంలో ఉన్న మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమని జయప్రదం చేయాలని ఎస్సై సాయికుమార్ తెలిపారు.

లక్ష్మినరసింహస్వామిని దర్శించుకున్న ఎంపీ అంబికా లక్ష్మినారాయణ

- ఆలయంలో ప్రత్యేక పూజలు, సన్మానించిన చైర్మెన్, కార్యనిర్వహణ అధికారి

- భక్తులకోసం వాటర్ ప్లాంటు ఏర్పాటుకు రూ.5 లక్షలు మంజూరుకు ఎంపీ హామీ

- ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధికి రూ.60 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడి

ఉరవకొండ, మే 8 ప్రభాతవార్త

లక్ష్మినరసింహస్వామిని దర్శించుకొంటున్న ఎంపీ అంబికా లక్ష్మినారాయణ

అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మినారాయణ శుక్రవారం ఉరవకొండ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మినరసింహస్వామిని దర్శించుకున్నారు. ఎంపీ ఉదయం ఆలయానికి చేరుకోగానే ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ రేగటి నాగరాజు, ఆలయ కార్యనిర్వ హణ అధికారి సాకే రమేష్‌బాబు అర్చకులతో కలిసి ఆయనకుఘనసా ్వగతంపలికారు. ఎంపీప్రధాన ఆలయం లో లక్ష్మినరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించగా ఆలయ చైర్మెన్, ఈవో ఆయన్ను శాలువాకప్పి పూలమాలలతో సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ ఆలయ కార్యాలయంకు వెళ్లి ఆలయ ధర్మకర్తల మండలి నూతన చైర్మెన్‌గా ఎన్నికైన రేగటి నాగరాజును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీచైర్మెన్, ఈవోలతో ఆల యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నూతన రథం తయారు, బ్రహోత్సవాలు జరిగిన తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర ్భంగా ఎంపీ అంబికా లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఆలయాని కి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యార్థం వాటర్ ప్లాంటు ఏర్పాటుకు ఎంపీ నిధుల ద్వారా 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అభ్యర్థన మేరకు ఇదివరకే ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధికి 60 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వి.సుంకరత్నమ్మ, టీడీపీ మండల కార్యదర్శి మోపిడి గోవిందు, నాయకులు సూరి తదితరులు ఉన్నారు.

ఆలయన నూతన చైర్మెన్ రేగటి నాగరాజును సన్మానిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మినారాయణ

వైభవంగా ఓం శక్తి ఆలయంలో మహా కుంభాభిషేకం

- రూ.50 వేలు అందించిన జేవిఎస్ అనిల్ - మహేష్ ఆధ్వర్యంలో అన్నదానం

రూ.50 వేలు అందిస్తున్న అనిల్ దంపతులు , . అన్నదానం చేస్తున్న మహేష్

హిందూపురం మే 8 ప్రభాతవార్త

హిందూపురం బెంగళూరు ప్రధాన రహదారిలో కిరికెర పాత స్పిన్నింగ్ మిల్ క్వార్టర్స్ ప్రాంతంలో ఉన్న ఓం శక్తి దేవాలయం పునర్నిర్మాణం జరిగిన క్రమంలో మహా కుంభాభిషేకం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు సడియప్పన్ తులసి దంపతులు, మునిరాజు నాగమణి దంపతులు, లక్ష్మణ్, సూర్య నారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హోమా లు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. బెంగళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక పుష్పాల అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. జనసేన పార్టీ సీనియర్ నాయకులు, శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం పాలకమండలి కాబోయే చైర్మన్ మహేష్ సౌజన్యంతో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ దంపతులు జె.వి.ఎస్. అనిల్ కుమార్ దంపతులు రూ. 50 వేలు విరాళంగా ఆలయ కమిటీకి అందజేశారు. దాతలకు ఆలయ అర్చకులు ప్రత్యేక ఆశీర్వాదం అందించారు. వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొన్నారు. అదేవిధంగా అశ్వర్థ మహా వృక్షాలకు కళ్యాణం జరిపించారు.

పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను తనిఖీ చేసిన మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు

కనగానపల్లి మే 8 ప్రభాతవార్త

పిహెచ్సి ని తనిఖీ చేస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు ఎంపీడీవో అనిల్ కుమార్ తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం నందు, హాజరు పట్టిక, ఫార్మసీ, ల్యాబ్ ను పరిశీలించారు. అక్కడిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ అందిస్తున్న సేవలను గురించి సమీక్షించారు. హాస్పిటల్లో పరిసరాల పరిశుభ్రత గురించి సలహా ఇచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర గురించి వివరించారు. రోజు జరుగు తున్న, గర్భవతుల క్లినిక్ ను పరిశీలించారు. వారికి అందు తున్న సేవలు గురించి గర్భవతులను అడిగి తెలుసుకు న్నారు. అలాగే 14 సంవత్సరముల ఆడపిల్లలకు, వేస్తున్న హెచ్ పి వి వ్యాక్సిన్ ను తనిఖీ చేశారు. పిల్లలకు ఆ వ్యాక్సిన్ గురించి అడిగి, దానివల్ల ఉపయోగాన్ని, పిల్లలకు వివరించారు. జనరల్ వార్డు, కాన్పుల వార్డును ఆయన తనిఖీ చేశారు. అలాగే వడదెబ్బపై అవగాహన ర్యాలీ నిర్వహించారు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ డా" చెన్నారెడ్డి, మండల హెల్త్ ఎంపీ హెచ్ ఈ ఓ మనోహర్ బాబు, ల్యాబ్ టెక్నీషియన్ విష్ణువర్ధన్ బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ తిమ్మరాయ స్వామి పుష్కర వార్షికోత్సవం టీడీపీ నేత దేవినేని ధర్మతేజ ప్రత్యేక పూజలు

కళ్యాణదుర్గం, మే 8 ప్రభాతవార్త:

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో వెలసిన శ్రీ తిమ్మరాయ స్వామి ఆలయం పుష్కర కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా గురు వారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించా రు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యేఅమిలినేని సురేంద్ర బాబు సూచనల మేరకు టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సంద ర్భంగా గ్రామస్థులు, టీడీపీనాయకులతోకలిసి ఆల యానికి చేరుకున్న ఆయన శ్రీతిమ్మరాయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. గ్రామ పెద్దలు, భక్తులు, పార్టీనాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ తిమ్మరాయ స్వామి పుష్కర వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకుడు దేవినేని ధర్మతేజ